

# అనగనగా...కథలు

## - డా.శైలజ చందు



డియర్ రీడర్స్,

పేషంట్లు , హాస్పిటల్ గురించి కాకుండా ఎప్పుడైనా వేరే genreకథ వ్రాయాలని మనసుబలాటపడుతుంది.

దాని ఫలితమే ఈ నెలనుంచి 'అనగనగా...కథలు'

**చందు శైలజ**

***

**సింహపురి** రాజ్యంలో, నీల సిందూర పర్వతం పై కాత్యాయినీ దేవి ఆలయం ఉంది. ఆలయం వెనుక లోయలో, భూభాగమన్నదే కనిపించనంత దట్టమైన అడవి. లోయలో నుండి రెండు ఎత్తైన నీల సిందూర వృక్షాలు ప్రత్యేకంగా కనిపిస్తూ ఉంటాయి. చుట్టూ ఉన్న వృక్షాల కంటే ఎత్తుగా నిలబడి దేవాలయం వైపు వాలి ఉంటాయి. పరసరాల్లో , మరెక్కడా గాలి వీయకపోయినా, ఆకు కదలకపోయినా, ఆ రెండు చెట్లూ నిరంతరం సంతోషంగా ఊసులాడుకుంటున్నట్లే కదులుతుంటాయి. నిత్యప్రేమికుల వలె ఎప్పుడూ అన్యోన్యంగా ఉంటాయి. ఆ రెండు చెట్లకూ పూజ చేస్తే , కన్యలకు కల్యాణమవుతుందనీ, ప్రేమికులకు ప్రేమ ఫలిస్తుందనీ ఆ చుట్టుపక్కల ఊళ్లలో వినికిడి. ఆ వృక్షాలను చూసేందుకు, వరమడిగేందుకు ఎక్కడెక్కడినుండో వస్తుంటారు. దేవి ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేసే కన్నెలు ఆ చెట్లకు మొక్కుతుంటారు.

ఆ జంట వృక్షాలలో ఒక దానికే పూలు పూస్తుంటాయి. ఋతువులకతీతంగా పూసే ఆ పుష్పాలను దేవాలయంలో పూజలకు వినియోగిస్తారు. నీల సిందూర పుష్పం చాలా పెద్దదిగా ఉంటుంది. దోసిలిలో ఒకే ఒక పుష్పం ఇముడుతుంది. నీల లోహిత వర్ణపు రేకులతో ఉన్న ఆ పూవు మధ్యలో మాత్రం, సిందూరం రంగులో ఉంటుంది. వేలితో ముట్టుకుంటే, చేతికి సిందూరం అంటుతుంది. దేవికి, ఆ సిందూరాన్నే నుదిటిన అలంకరిస్తారు.

ఎత్తుగా ఉన్న ఆ చెట్టు నుండి పూలు అందుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ఆ నగరంలోని ఒక వ్యక్తి వచ్చి నిలబడినపుడు మాత్రమే ఆ చెట్టు నమస్కరిస్తున్నట్లుగా వంగుతుంది. ఆయన ఉత్తరీయాన్ని విప్పి పట్టుకున్నపుడు చెట్టు నుండి పూలు జల జలా రాలతాయి. ఏకకాలంలో ఆయన కనుల వెంట ముత్యాలు కూడా.

ఈ విచిత్రం వెనక ఒక వృత్తాంతముందని, కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన కథను చెప్పుకుంటుంటారు.

***

అర్ధ రాత్రి, కేశవుడు వడివడిగా కొండ మెట్లు ఎక్కుతూ ఉన్నాడు. జడివాన కురుస్తోంది. వర్షపు ధారలు అతన్ని నిలువునా తడిపివేస్తున్నాయి. చీకటి వల్ల, దారి కనిపించడం కూడా కష్టంగా ఉంది. అయినా పరుగు వంటి వడకతో, ఆగకుండా పర్వతం పైకి వెళుతున్నాడు. వర్షానికి మెరుపులు, ఉరుములు తోడై ఆకాశం ఆగ్రహంగా ఉన్నట్లు తోస్తుంది. అతని మనసు అంతకన్నా ఆగ్రహంగా ఉంది.

వేగంగా వీస్తున్న గాలి తోడైంది. కళ్లలోకి ఈడ్చికొడుతున్న వర్షపు జల్లులతో దారి కనిపించడం లేదు. వడి వడిగా వెళుతుండడంతో, తడిసిన కొండ మెట్ల మీద పాదాలు పట్టు తప్పి జారిపడుతున్నాడు. వెంటనే లేచి, మరలా పరుగందుకుంటున్నాడు. మెట్ల మీద కోసురాళ్లు తగిలి పాదాలకు గాయమవుతున్నా, లక్ష్య పెట్టడడం లేదు.

మనసుకైన గాయంతో పోలిస్తే అవెంత.

'ఎంతటి అవమానం!'

తండ్రి మాటలు చెవులలో వినపడుతున్నాయి.

ఎంతలేసి మాటలన్నాడు?

'సోమరి

చేతకానివాడు

తనకేమి చేతనవునో తండ్రికి తెలియజెప్పాలి.

లక్ష్యం లేకుండా జీవించడం మృత్యువుతో సమానమన్నాడు.

అవును. తనకిపుడు మృత్యువే లక్ష్యం. దాన్ని నెరవేరుస్తాడు.

నిశ్చయంగా అదే జరగాలి.

తన శవాన్ని చూసి తండ్రి కుమిలిపోవాలి. కాత్యాయినీ దేవి ఆలయం వెనుక నున్న లోయలో దూకితే సరి.' అనుకున్నాడు.

ఆ దేశంలో విరూపాక్షుడనే గొప్ప శిల్పి ఉన్నాడు. విరూపాక్షుడు ఉలి పట్టుకుంటే రాత్రి పగలూ ఏకమైపోతాయి. పిడుగులు పడినా ధ్యానం చెదరదు. దేశ దేశాల నుండి ఎందరో శిల్పకళాకారులు అతని వద్ద శిష్యరికం చేయాలని వచ్చేవారు. నీల సిందూర పర్వతం మీద వెలసిన కాత్యాయినీ దేవి కి దేవాలయం కట్టించాలని రాజ గురువు సూచించగా, మహారాజు దేవాలయ నిర్మాణ బాధ్యతలను విరూపాక్షుడకప్పగించాడు. తన శిష్యులతో కలసి గుడి గోపురం పైనా, ప్రాంగణంలోనూ శిల్పాలను ఏర్పాటు చేయడంలో కొన్ని నెలలుగా నిరంతరం శ్రమిస్తున్నాడు.

దేవాలయ నిర్మాణం దాదాపు పూర్తి కావొస్తోంది. అతని శిష్యులలో కొందరు ప్రజ్ఞావంతులున్నారు. వారు ఆశ్చర్యం కలిగించేలా శిల్పాలను చెక్కడం చూసి, తన కుమారునికా ఆసక్తి లేనందుకు విచారించాడు విరూపాక్షుడు.

కేశవుడతని కుమారుడు.

కేశవుడు చూడ చక్కని యువకుడు. బాల్యంలో కొంత కాలం తండ్రి వద్ద శిల్పకళనభ్యసించాడు కానీ యవ్వనాగమనంతో అతని శ్రద్ధ సన్నగిల్లింది. అతనికో స్థిరమైన వ్యాపకం గానీ , లక్ష్యం గానీ లేవు. ఎప్పుడూ మిత్రులతో కలసి నగరంలో విహరిస్తూ ఉండేవాడు.

ఆ నాటి రాత్రి ఆనాడు ఆలస్యంగా ఇల్లు చేరిన కేశవుని పై తండ్రి కోపగించుకున్నాడు. భాషకు ఆగ్రహం తోడైతే, పదాలు పరుషమవుతాయి. తండ్రి మాటలకు కేశవుడి మనసు నొచ్చుకుంది. గాయ పడిన మనసు తీసుకున్న నిర్ణయమే అతన్ని నడిపిస్తోంది.

చీకటి దారిలో వేగంగా నడిచి కొండ పై భాగానికి చేరుకున్నాడు. అతడు నడచి వచ్చే సమయంలో కొండ దారిలో చిమ్మ చీకటి. కానీ కొండపైకి చేరుకోగానే చీకటి అంతమైంది. ఆ ప్రదేశమంతా ప్రకాశవంతంగా ఉంది. జడివానకు అంతంలేదా అన్నట్లు వర్షం కురుస్తూనే ఉంది.

ఆకాశం నుండి వెండిధారలు కురుస్తున్నాయా అన్నంత వెలుగు ఉన్నదా ప్రదేశంలో. మేఘాలు కమ్ముకుని జడివాన కురుస్తున్నా సరే , ఆ ప్రదేశమంతా అంత ప్రకాశవంతంగా ఎందుకున్నదో, ఆ వెలుగెక్కడనుండి వస్తోందో, అర్థం కాలేదు.

ఆ కాంతిలో వర్షపు ధారలను చూస్తుంటే, మల్లెల జల్లు కురిసినట్లు, ఆహ్లాదంగా ఉంది. పూర్తిగా తడిసిపోతున్నా చలివెయ్యడం లేదు. వెచ్చని వర్షపు ధారలలో తడిసిపోతూ ఎదురుగా చూశాడు.

దేవాలయ ప్రవేశ ద్వారం వద్ద బ్రహ్మాండమైన సింహాలు స్వాగతిస్తున్నాయి. వాటిని చూడాలంటే, దూరాన నిలబడి తల యెత్తి చూడవలసిందే. వాటి రూపం, ఠీవి చూస్తుంటే, అవి సజీవంగా ఉన్నాయేమోనన్న అన్న అనుమానం వచ్చింది.

లోపలికి అడుగు పెట్టాక, ఒక విశాలమైన వింత లోకంలో అడుగిడిన భావన కలిగిందతనికి. కొండ రాతిని చదును చేసి, విశాలమైన ప్రాంగణం వలె మలచారు. ఆ ప్రదేశం లేత గోధుమ వర్ణంలో సిందూరపు రంగు కలసినట్లున్నది. పై నుండి పడుతున్న వర్షధారలు, క్షణాల్లో మాయమవుతున్నాయి.

చీకటి ఆకాశం, ఆగని వర్షపు ధారలు, కొండ మీద బంగారు కాంతి, ఆ వింత కలయిక అతను మునుపెన్నడూ చూడలేదు. ఎలా సాధ్యం అని ప్రశ్నించే వివేకానికి మైకం కమ్మినట్లున్నది . స్పృహకూ, స్వప్నానికీ, మధ్యస్థంగా ఉంది అతని స్థితి. అపూర్వమైన అనుభూతిని అనుభవించకపోతే అదృశ్యమవుతుందేమోనని ముందుకు సాగిపోతున్నాడు.

ఆ వెలుగులో, కాత్యాయినీ దేవి విగ్రహం అతని వైపే ప్రసన్నంగా చూస్తోంది. దేవి ముఖం మీద ఎర్రని సిందూరం సూర్యకాంతివలె మెరుస్తోంది. బిడ్డ అల్లరికి కోపగించని తల్లి చూసినట్లున్నది ఆమె చూపు. అతనిలోని ఆవేశం తగ్గినట్లైంది.

తాను ఆగ్రహంతో అక్కడికి వచ్చినట్లు జ్ఞాపకం తెచ్చుకోబోయాడు. సాధ్యం కాలేదు. ఆ కోపం మునుపటి జన్మదేమో అన్నంత శాంతం అలముకుంది. ఆమె ముందు మోకరిల్లాడు. తల్లి ముందు ,తప్పు చేసిన పిల్లవాడిలా సిగ్గుపడ్డాడు.

ఆ ప్రదేశం విడిచి వెళ్లాలని లేదు. ఆ ప్రాంగణంలోని శిల్పాలను చూస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాడు.

అద్భుతమైన కళారూపాలతో దేవాలయ ప్రాంగణం నిండి ఉన్నది. ఏ శిల్పాన్ని చూసినా ఆగిపోతున్నాడు. ఒక శిల్పంలో, యువతి అతి పలుచని మేలి ముసుగు కింద సిగ్గుపడుతోంది. అడుగున కర్ణాభరణాలు కనిపించేంత పలుచని వస్త్రమా ముసుగు. దాని అడుగున నును సిగ్గుని కూడా చెక్కగల సామర్థ్యం! అది కనికట్టేమో అర్థం కాలేదు. ఒకరి పద మంజీర విశేషాలను చూస్తూనో, మరొకరి కర కంకణ వివరాలను పరిశీలిస్తూనో ఎక్కడికక్కడ ఆగిపోతున్నాడు. సమయం తెలియడం లేదు.

ఒక శిల్పం నుండి వేరొక శిల్పం వైపు దాటిపోతూ, దీనిని మరలా సావకాశం వెనకకు వచ్చి చూడవలసిందే అనుకుని ముందుకు సాగుతున్నాడు. ప్రతి శిల్పం లోనూ జీవమున్నదా అన్న భ్రాంతి కలుగుతోంది. చూసిన కొద్దీ, కొత్త అర్థాలు తెలుస్తున్నాయి. నిగూఢమైన భావమేదో తెలుస్తోంది. ఊసుబోక చెక్కిన శిల్పం ఒక్కటీ లేదు.

ఎంత సమయం గడిపినా, అర్థం చేసుకోవడానికి జీవితం మొత్తం చాలదని అనిపిస్తోంది.

తండ్రి ఎంత గొప్ప శిల్పి?

దేవి విగ్రహం దాటి వెనుకకు వెళ్లాడు. ఇంతలో ఒక మెరుపు మెరిసింది. వెను వెంటనే పిడుగు ధ్వని వినిపించింది.

కనులు తెరిచి చూశాడు. పర్వతం అంచున, లోయ వైపు తిరిగి కూర్చుని ఉన్న యువతి శిల్పం ఒకటి ఉన్నది. ఆ శిల్పం వెనుకవైపు భాగమే కనిపిస్తోంది. ముందు భాగం, ముఖం చూడాలంటే లోయలోకి అడుగుపెట్టాలేమో.

నీలి మేఘాల వంటి కేశాలు. కేశాలు దాచలేని ఎడమ భుజము, చేతికున్న ఆభరణమూ, అతి సుకుమారమైన జఘనం తప్ప వివరాలేమీ లేవు. జఘనపు వంపుకు కొద్దిగా దిగువన ఆమె వస్త్రం, ఆభరణాలు చెక్కారు.

ఆ శిల్పి ఎవరో , అతని ప్రజ్ఞకు ఆశ్చర్యపడ్డాడు.

'ఎంతటి సౌకుమార్యం. ఎంత లావణ్యం.

ఇంత అందమైన స్త్రీ రూపాన్ని శిల్పంలా చెక్కవచ్చునేమోగానీ, సృష్టించడం బ్రహ్మకైనా సాధ్యమా?'

మెరుపు మెరిసింది. ఒక కాంతి రేఖ ఆమె జఘనపు వంపులో పడి, మెరిసింది. అతని చూపు ఆ వంపులోనే చిక్కుకుని ఆగిపోయింది. సౌందర్యనిధి దాగిన ప్రదేశమదేనన్నట్లు చూపు తిప్పుకోవడం అతని వశం కావడం లేదు.

అతని చూపులో సౌందర్యం పట్ల మన్నన ఉంది. ఆ సౌందర్య రహస్యాన్ని చూపులతోనే ఛేదించే పనిలో నిమగ్నమైనాడు.

చూపు తిప్పితే, ఊపిరాగిపోతుందేమోనని నిశ్చలంగా నిలబడి చూస్తున్నాడు.

గాలివీస్తోంది. కేశాలు కదుతున్న భ్రాంతి కలిగింది.

ఆ శిల్పాన్ని దాటి పోగల సామర్థ్యం తనకు లేదని నిశ్చయంగా తలచి అక్కడే నిలబడి ఆ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తున్నాడు.

క్షణమొక యుగానుభవంగా ఉంది.

యుగాలు గడచినా ఆకళింపు కానంత ఉత్కృష్టమా సౌందర్యం.

జడివానలో ,శిల వలె నిలబడిపోయాడు.

కొంత సేపటికి వర్షం ఆగిపోయింది. గాలులు హాయిగా వీస్తున్నాయి. పర్వత పుష్పాల పరిమళం గాలిలో నిండింది అతని తడిదుస్తులు ఆరిపోయాయి. అకారణమైన ఆనందం వెల్లువవుతోంది.

కొండ మీద వెలుగు మరింత ప్రకాశమైంది. బంగారు కాంతి తో వెన్నెల విరిసినంత హాయిగా ఉంది.

నల్లని మబ్బులతో నిండిన ఆకాశంలో అప్పుడొక మెరుపు, అప్పుడో మెరుపు కనిపిస్తోంది.

ఒక వైపు శాంతం , మరొక వైపు ప్రళయం అన్నట్లుగా ఉంది వాతావాణం.

అంతటి సౌందర్యాన్ని చెక్కగల శిల్పి ఎవరు?

తండ్రి శిష్యులలో ఎవరో అంతటి ప్రజ్ఞాశాలి?

ఆశిల్ప సౌందర్యాన్ని ఆరాధించడమే ధ్యానమన్నట్లు , అది తప్ప తన జన్మకు వేరే అర్థం లేదని నిశ్చయంగా నమ్మాడు. శ్వాసించితే కాలమాగిపోతుందేమోనని, రెప్పవాలిస్తే ఆ అపూర్వ స్వప్నం మాయమవుతుందేమోనని, భీతి చెందాడు.

నిద్ర పోవాలన్న శరీరపు సంకేతాలను నిర్లక్ష్యం చేసి రాత్రి మూడవ జాము వరకూ నిలబడే ఉన్నాడు.

ఎక్కడో మెరుపు మెరిసింది.

వెంటనే పిడుగు పాటు ధ్వని.

కేశవుడికి స్పృహ తప్పింది.

❦❦❦

కళ్లు తెరిచి చూస్తే, ఇంటిలో తన శయ్యపైనున్నాడు. పక్కనే తల్లి ఆందోళనగా చూస్తోంది. ఉదయం, దేవాలయ పనుల నిమిత్తం వెళ్లిన తండ్రి శిష్యులు , స్పృహ తప్పి ఉన్న తనని మోసుకొచ్చారని ఆమె చెప్తోంది. లేచి కూర్చున్నాడు. తాగడానికేదో తెస్తానని ఆమె వెళ్లింది.

శిరసంతా భారంగా ఉంది.

అస్పష్టమైన ఆలోచనలతో తికమకగా ఉంది.

‘రాత్రి ఏం జరిగింది?’ అని

ఆలోచిస్తుంటే, ‘జరిగింది కలా? నిజమా?’ అన్న అనుమానం వచ్చింది.

కొండ అంచునున్న ఆ శిల్పం!

ఆ సుందర శిల్పం.

ఆహారమూ, నిద్ర లేక అశక్తుడై ఉన్నా, రాత్రి తను చూసిన శిల్పం గుర్తుకు రాగానే, అణువణువులోనా జీవం నిండినట్లైంది.

ఒక్క సారి ఆ శిల్పాన్ని మరలా చూడాలి.

కొండ వైపు పరుగుతీశాడు.

తల్లి పానీయంతో వచ్చే సరికి, శయ్య మీద కేశవుడు లేడు.

కొండ పైన, తండ్రితో కలసి వందలాది xమంది శిల్ప కళాకారులు, పనిలో సతమతమవుతున్నారు.

వడివడిగా దేవాలయం వెనుక వైపున్న లోయ వైపు వెళ్లి చూశాడు. రాత్రి ఆ శిల్పాన్ని చూసిన ప్రదేశానికి వెళ్లి నిలబడ్డాడు.

ఆశ్చర్యం. ఆ ప్రదేశం లో బలమైన వృక్షాలు తప్ప, శిల్పమేమీ లేదు.

ఆశ్చర్యపడ్డాడు.

'రాత్రి చూసిన ఆ శిల్పం ఏదీ? తను కలగన్నాడా? రాత్రి వర్షానికి ఒక వేళ లోయలో పడిపోయిఉంటుందా?'

లోయలో తొంగి చూశాడు. చెట్లు ,లతలు తప్ప వేరే ఏమీ కనిపించలేదు.

ఒక వేళ లోనికి తరలించుకునిపోయి ఉంటారేమోనని దేవాలయం లోపలకు వెళ్లి వెదికాడు.

అక్కడ కూడా కనిపించలేదు.

తండ్రి ముఖ్య శిష్యుడైన సోమదత్తుడి వద్దకు వెళ్లి, ఆ శిల్పం ఎలా ఉంటుందో, ఎక్కడ చూశాడో ఆనవాళ్లు చెప్పి, 'ఆ శిల్పం ఏదీ?' అని అడిగాడు. ఆ వివరాలు విన్న సోమదత్తుడు విస్మయ పడ్డాడు. అటువంటి శిల్పమేదీ లేదని నిశ్చయంగా తెలిపాడు.

రాత్రి చూసిన శిల్పాలన్నీ కళ్లెదురుగా ఉన్నాయి. తనను పరవశింపజేసిన ఆ శిల్పం తప్ప.

'అయితే అది సుందర శిల్పం కాదా?'

'సుందరిని శిల్పమని భ్రాంతి చెందాడా?'

కొద్ది సేపటికి అతనికి విషయం బోధ పడింది.

'అయితే ఆమె ఎవరు? ఎక్కడ ఉంటుంది?'

అశాంతిగా అమ్మవారి విగ్రహం ముందు కూలబడ్డాడు. అందరూ తీరికలేకుండా శ్రమిస్తున్నారు. ఉలుల శబ్దాలతో పర్వతం ప్రతిధ్వనిస్తోంది. నిద్రలేదు. ఆహారం లేదు. మనసు మనసులో లేదు.

"ఆ సుందరి కనిపించి వెళ్లిపోయింది. ఎలా అమ్మా?" దేవిని ప్రశ్నించాడు.

"ఆమె నాకు కావాలి కదా!" న్యాయం కోరాడు.

కన్నీళ్లు పెట్టుకున్నాడు.

దేవాలయ అర్చకుడు వచ్చి, తీర్థ ప్రసాదాలిచ్చి,

"ఇంటికెళ్లు కేశవా. ఇక్కడెందుకు?" అని అనునయంగా చెప్పాడు.

'ఎలా వెళతాడు. తన మనసు దోచిన సుందరి లేకుండా, ఒంటరిగా ఎలా మనగలగడం?'

రాత్రి ఆ శిల్పం కనిపించిన ఆ ప్రదేశం శూన్యంగా ఉండడం భరించలేకపోయాడు.

'తన నుండి ఎలా వెళ్లిపోతుంది?

ఆమెను తన కోసం సృష్టించుకోవాలి.'

అందరూ దేవాలయం ముందున్న ప్రాంగణంలో శిల్పాలను చెక్కుతున్నారు. ఉలి తీసుకుని దేవాలయం వెనుకకు వెళ్లాడు. రాత్రి ఆమెను ఏ ప్రదేశంలో చూశాడో, అదే చోట ఉన్న కొండ రాయిని చెక్కడమారంభించాడు. ఊహ తెలిసిన నాటి నుండీ , తండ్రి శిష్యులచేత వల్లింపచేసే పాఠాలు అతడి మస్తిష్కం లో నిక్షిప్తమైయున్నాయని అతనికి కూడా తెలియదు.

నీలి సముద్రం లోని అలలు.

నల్లని మేఘాల శ్రేణులు.

అతడి మనోయవనిక పై పరచుకున్న ఆమె కురులు.

సంతోషం, విస్మయం , ఆరాధన అన్నీ కలగలసిన భావంతో , రాతిని చెక్కసాగాడు. ఒక్కొక్క కేశాన్ని ఊహించుతూ, ఉత్తేజితుడవుతున్నాడు. ఉలిధ్వని అతనికి ధ్యానమైంది.

అతని లోని నిశ్శబ్ద శూన్యం నుండి సుందర శిల్పం ఉద్భవిస్తోంది. చుట్టూ ఉన్న ప్రకృతి, శిల్పంలోని జీవానికి అచ్చెరువొందుతోంది. సూర్యాస్తమయం అయింది. అందరూ ఇళ్లకు వెళ్లారు. కేశవుని ఉలిధ్వని ఆగలేదు.

చంద్రోదయమయింది. వెన్నెల విరబూసింది. జఘనపు వంపులో తాను వీక్షించిన సౌందర్యమంతా శిల్పంలో ప్రతిష్టించాలని తపన పడుతున్నాడు.

అతడాశించిన మెరుపునివ్వడానికి వెన్నెల తోడ్పడుతోంది. అతనికి సంతృప్తిగా లేదు. కొండ దిగి, నది ఒడ్డునుండి ఇసుకను తెచ్చాడు. మెడలోని బంగారు గొలుసు తీసి ఇసుకతో కలిపి చూర్ణం చేశాడు. శిల్పానికి నగిషీ పెట్టాడు.

రాత్రి సమయంలో కొండ మీద వింత కాంతి నిండి ఉండేది. ఆ వెలుగులోనే శిల్పాన్ని చెక్కుతూ పరవశించేవాడు. శిల్పంతోనే నిద్ర, నిద్రలోనే స్వప్నం. స్వప్నంలోనే చేతన. చేతనలోనే జడత్వం.

సూర్యోదయ సమయానికి నిద్రలోకి జారుకునేవాడు.

ఆమె వెనుక వైపు భాగం, తాను చూసినంత మేరకు శిల్పాన్ని చెక్కాడు. మనసులో సంతృప్తి లేదు. ఆమెను అసంపూర్తిగా ఉంచడం అపరాధమనుకున్నాడు. ఆమె ముఖం ఎలా ఉంటుందో తెలియదు. ఎలా అయినా సరే ఆమెకు పూర్తి రూపాన్నివాలనుకున్నాడు.

ఇంత చక్కని కేశాలున్న యువతి , ముఖమెలా ఉండి ఉంటుందోనని ఆలోచించాడు. నిరంతరం అదే ధ్యాస. కనులు మూసుకుని తాను ఆమెను చూసిన రాత్రిని , ఆ అనుభవాన్నీ మరల మరల జ్ఞప్తి తెచ్చుకునేవాడు.

మనసు లగ్నం చేస్తే అసాధ్యమైనదేదీ ఉండదుకదా.

ఆమె అందం ఇలా ఉండి ఉంటుందేమోనన్న ఆలోచన మనసులో ఆమెకొక రూపాన్నిచ్చింది.

ముఖమూ , మిగిలిన శరీరమూ కూడా చెక్కాలని తలచాడు. ఆ పని పూర్తి చేయాలంటే అతను లోయలోకి వెళ్లవలసిందే. అంచనాకందనంత లోతుగా ఉన్నదా లోయ. లోయలో పెరిగిన బలమైన వృక్షాలకు తాళ్లు కట్టి కొన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు. తాననుకున్న రూపం వచ్చేవరకూ ఆ వృక్షాలపై నిలబడి శిల్పాన్ని చెక్కేవాడు. కొన్ని రాత్రులు , పగళ్లు గడిచాక ఆమెకో రూపం వచ్చింది.

తోటి శిల్పులంతా అతని ప్రజ్ఞ చూసి ఆశ్చర్యపోయారు.

విరూపాక్షుడు , కుమారుని పనితనం చూస్తూనే ఉన్నాడు. అతని తపన వెనుక స్ఫూర్తి ఏమిటా అని ఆలోచించాడు.

శిల్పం మొత్తం పూర్తి అయింది. ఆమె ఎవరో తెలియదు. ఆమె పట్ల, ఆ సౌందర్యం పట్ల ఆరాధన, గౌరవం , అంత కన్నా మమకారం ఏర్పడింది. అంతా పూర్తి అయాక ఆమెను విడిచి వెళ్లడానికి మనసు రాలేదు.

తప్పుని సరై ఇంటికి వెళ్ళాడు. ఆ రాత్రి నిద్రపోవాలని ప్రయత్నించాడు కానీ సాధ్యం కాలేదు. క్షణమొక యుగం లా గడుస్తోంది. గవాక్షం నుండి కొండ మీద దేవాలయం వైపే చీకటిలోకి చూస్తున్నాడు. అర్ధ రాత్రి అయాక, జడివాన మొదలైంది. ఆమె ఒంటరిగా తడిసిపోతూ ఉండి ఉంటుందని కలవరపడ్డాడు. ఇంట్లో ఉన్న పట్టు కంబళి తీసుకుని పరుగు పరుగున కొండ మీదకు వెళ్లాడు. కొండ మీద చీకటిగా ఉంది. ఇదివరకు రాత్రి సమయంలో శిల్పాన్ని చెక్కుతున్నపుడు ఉండే వెలుగు లేదు. ఆ శిల్పం ఎటు వైపు ఉన్నదో అంచనా వేసి ఆ చోటికి వెళ్లాడు.

తాను తెచ్చిన పట్టు కంబళి ఆమెకు కప్పి, " వంటరిగా వదలి వెళ్లాను. మన్నించు." అని దూరంగా నిలబడ్డాడు.

శిల్పం మీద కప్పిన పట్టు కంబళి జారి అతని పాదాల వద్ద పడింది. దాన్ని తీసి మరలా కప్పబోయాడు. కఠినమైన శిలకు బదులుగా సుకుమారమైన దేహ స్పర్శ అనుభవమైంది. శరీరమంతా పులకరించి పోయింది. 'భ్రమ కాదు కదా' అనుకొని చేతులతో శిల్పాన్ని తడమాలనుకున్నాడు.

సుకుమారమైన రెండు చేతులు అతని ప్రయత్నాన్ని ఆపి వేశాయి. ఆ చేతులే , పూలదండలా మారి, అతని మెడలో హారంగా అమరింది.

వర్షం ఆగింది.

మెరుపు మెరిసింది. మెరుపు వెలుగులో ఆమె సిగ్గు మరింత వెలిగింది.

ఆనాడు సూర్యోదయం కాక మునుపే విరూపాక్షుడు నిద్రలేచాడు. ఉదయాన్నే లేచిన విరూపాక్షుడికి కొడుకు ప్రజ్ఞ గురించి అందరూ అనుకోవడం తలపుకు వచ్చింది. లక్ష్యం లేకుండా తిరిగే పుత్రుని గురించి ఇదివరకెంతో బాధపడేవాడు. ఆ దేవి కటాక్షంతోనే కేశవుడు బుద్ధిమంతుడైనాడని అనుకున్నాడు.

ఏనాడు తనవద్ద శిష్యరికం చేయకుండానే అంతటి విద్య ఎలా పట్టుబడిందో అర్థం కాలేదు. ఆ శిల్పాన్నొక సారి పరిశీలించాలనుకుని దేవాలయానికి చేరుకున్నాడు. సూర్యోదయానికింకా కొంత సమయముంది. వెలుగు రేఖలు ఆకాశాన్ని అందంగా తీర్చి దిద్దుతున్నాయి. రాత్రి కురిసిన వర్షానికి లోయలోని చెట్లన్నీ సంతోషంగా ఊగుతున్నాయి.

దేవాలయం వెనుకవైపుకు వెళ్లి, కేశవుడు చెక్కిన శిల్పానికి కొద్ది దూరంలో నిలబడి చూస్తున్నాడు. అక్కడున్న దృశ్యం చూసి ఆశ్చర్యపోయాడు. లోయ వైపు తిరిగి ఉండాల్సిన శిల్పం దేవాలయం వైపు తిరిగి కూర్చుని ఉన్నది. శిల్పం అటునుండి ఇటు ఎలా తిరిగిందో, ఆ వింతనెలా అర్థం చేసుకోవాలో అనుకున్నాడు. అంత కన్నా విచిత్రంగా, శిల్పానికి సజీవమైన కేశాలున్నాయి. పొడుగాటి అందమైన నీలి కురులు బంగారు కాంతులీనుతూ గాలికి అటూ ఇటూ ఊగుతున్నాయి.

ఆమె శరీరం మొత్తం కనిపించకుండా ఆమె పై పట్టు కంబళి కప్పి ఉన్నది. మొత్తం సరిగా పరీక్షించాలని దగ్గరకు వెళ్లి, కంబళిని తొలగించబోయి, ఒకసారెందుకో తల యెత్తి ముఖం వైపు చూశాడు. సిగ్గుతో కనులు దించుకుని ఉంది. ఆమె ముఖంలోని సిగ్గుని చూసి ఒక అడుగు వెనక్కు వేశాడు.

కొద్ది దూరంలో కేశవుడు ఆదమరచి నిద్రపోతున్నాడు. ఆమె ముఖంలోని సిగ్గు, శిల్పం పైన తమ ఇంటి వస్త్రం, విరూపాక్షునికి ఏదో అర్థమయినట్లూ, మరేదో అర్థం కానట్లూ ఉన్నది. కేశవుడిని నిద్రలేపకుండా కొండ దిగి వచ్చేశాడు.

తెల్లవారే సరికి , కేశవుడు చెక్కిన ప్రతిమ తన దిశను మార్చుకుందనీ, శిల్పానికి నిజమైన శిరోజాలు ఏర్పడ్డాయనీ, ప్రజలంతా చెప్పుకున్నారు. ఆ వింత వార్త నగరమంతా ప్రతిధ్వనించింది.

అంతే కాదు. ఆ నోటా , ఈ నోటా ఈ విషయం ఆ దేశపు రాజుగారి వద్దకు చేరింది. ఆ వింత చూసే ఏర్పాటు చేయమని తన పరివారాన్ని ఆదేశించాడు.

కొన్ని దినాల తర్వాత, ఒక సాయం సమయాన,

సంధ్య వెలుగులో, ఆ శిల్పాన్ని మైమరచి తదేకంగా చూడసాగాడు మహారాజు. నీలి మేఘాలకు బంగారు పూతలద్దినట్లున్న కేశాలు సజీవంగా అలల వలే గాలికి కదులుతున్నాయి. లోయనుండి వచ్చే అరుదైన పుష్పాల పరిమళంతో కలసి గాలివీస్తోంది. ఆమె అందం కనువిందు చేస్తోంది. శిరోజాలు గాలికి తొలిగినపుడు ఆమె చెక్కిలి , మెడ, భుజం కనిపించింది. అంతటి సౌందర్యం ఊహాజనితం కాదు. దీనికి స్ఫూర్తి ఎవరో ఉండి ఉంటారనుకున్నాడు.

అంతటి అద్భుత సౌందర్య రాశి ఎవరో!

"ఈ శిల్పానికి స్ఫూర్తిగా నిలిచిన సుందరి ఎవరు?" కేశవునినడిగాడు.

నిశ్శబ్దంగా తలవంచుకున్నాడు.

కేశవుడు ప్రత్యుత్తరమివ్వకుండా నిలబడినందుకు మహారాజు ఆగ్రహిస్తారేమోనని భయపడి, విరూపాక్షుడు కేశవుడి దగ్గరకు వచ్చి, "సమాధానం చెప్పవేం కేశవా?" అన్నాడు.

కళ్లెత్తి తండ్రి వంక చూసి, మరల కనులు దించుకున్నాడు.

కేశవుని హృదయభావన తండ్రికర్థమైంది.

"ప్రభూ, ఆ శిల్పం ఊహాజనితం. తన ఊహల్లో మెదిలిన ఆలోచనతోనే చెక్కాడు."

"ఆ మాట నీ కుమారుడిని చెప్పమను విరూపాక్షా."

తండ్రీ కొడుకులు ఒకరినొకరు చూసుకున్నారు.

మరల నిశ్శబ్దమే.

మహారాజు ప్రశ్నకు సమాధానమివ్వకపోవడంతో ఎంతటి ఆగ్రహానికి గురికావలసి వస్తుందోనని పరివారమంతా భీతి చెందారు. ప్రకృతికూడా నిశ్చలంగా నిలబడింది. ఆకు కదలడం లేదు.

"పోనీ, నీ శిల్పకళ మీద ఆన తీసుకొని చెప్పు విరూపాక్షా, అది ఊహా శిల్పమంటావా?"

"ప్రభువులు క్షమించాలి." ఏమి మాట్లాడాలో తెలియక ప్రాధేయపూర్వకంగా మహారాజు వైపు చూశాడు విరూపాక్షుడు.

విరూపాక్షుడు, కేశవుడు ఇద్దరూ నిశ్శబ్దంగా ఉన్నారు.

"మీ ఇరువురి మౌనాన్ని రాజధిక్కారంగా పరిగణించ వచ్చునా?" రాజు ప్రశ్నించాడు.

విరూపాక్షుడు కలవర పడ్డాడు.

"మహారాజా. కేశవుడు వట్టి అమాయకుడు. అతనికేమీ తెలియదు. నా కుమారుని పై దయజూపండి."

రాజు కేశవుడి వైపు చూశాడు. అతనికి సమాధానం చెప్పే ఉద్దేశం ఉన్నట్లనిపించలేదు. తండ్రికి శిక్ష అంటే కేశవుడు తప్పకుండా నిజం చెప్తాడని ఆలోచించి, "విరూపాక్షా. అతడు వివరాలు వెల్లడించని పక్షంలో నీకే శిరచ్ఛేదం." ప్రకటించాడు

"ప్రభువులే శిక్ష విధించినా మహా ప్రసాదం గా స్వీకరిస్తాను. నా పుత్రుడు క్షేమంగా ఉంటే అంతే చాలు."

"ప్రభూ, నా తండ్రిని విడిచిపెట్టండి. ఆ శిక్ష ఏదో నేనే స్వీకరిస్తాను. నా తండ్రికే సంబంధమూలేదు."

"అయితే ఆమె ఎవరు. ఎక్కడ ఉంటుంది. వివరాలు చెప్పు."

"తెలియదు ప్రభూ."

"నువ్వామెను చూశావా?"

ఆమె వివరాలు ప్రజలందరి ముందూ చెప్పడం భావ్యం కాదని మరలా తలవంచుకున్నాడు.

ఆమె రచించిన తన ప్రణయకావ్యాన్ని పది మంది ముందూ పఠించడమా?

కేశవుడి మౌనం , రాజుకు ఆగ్రహం తెప్పిస్తోంది.

"ఆ శిల్పాన్ని పెకలించి తీసుకురండి . అది నా మందిరంలో ప్రతిష్ఠించండి." సేవకులనాజ్ఞాపించాడు రాజు.

"ప్రభూ!" కేశవుడు ఆతృతతో కదిలాడు. "ఆమెను దేవి సమక్షం లో ఉండనీయండి ప్రభూ."చేతులు జోడించాడు.

మహారాజు అతని మాటలు విననట్లు, "చూస్తారేం?" ఆగ్రహంగా పరివారం వైపు చూశాడు.

"శిల్పాన్ని అక్కడినుండి తొలగించండి. ఆ పైన విరూపాక్షుడిని కాత్యాయనీ దేవికి బలి ఇవ్వండి. కేశవుడిని బందీని చేసి కారాగారంలో ఉంచండి." సేవకులకు ఆదేశించాడు.

ఇంతలో ఆ ప్రదేశం కదిలినట్లనిపించింది. మహరాజు కళ్లు తిరిగి తూలిపడబోతుంటే సేవకులు పట్టుకున్నారు. విచిత్రమైన శబ్దాలు వినవచ్చాయి. అందరూ ఆ శిల్పం వైపు తిరిగి నిశ్చేష్టులై చూశారు.

*(సశేషం)*

Post your comments